
58581

# తామునేర్చినవిద్య



రచన: సులోచన

సాయం కాలం క్లబ్‌లో చాల సందడిగా వుంటుంది. పగలు పత్రిక వంకనైనా చూడటానికి విరామం దొరకని చిన్నచిన్న ఉద్యోగస్తుల దగ్గర్నుంచీ—పేకాట మోజులో మూడు రోజులపాటు భోజనానికి ఇంటికి వెళ్ళేందుకు కూడా మర్చిపోయే ప్రబుద్ధులవరకూ క్లబ్‌లో వుంటారు. క్లబ్ క్రిందిభాగంలో రిటైర్డు తహశీల్‌దారు నారాయణరావు గారు, ఛైర్మను చలపతిరావు గారు, షావుకారు శేషాద్రిరావుగారు, రెవెన్యూ ఇనస్పెక్టరు రామచంద్రరావు గారు మొదలుగాగల ఏడుగురు కోయంబత్తూరు డౌను బేడలమీద ఆడుతున్నారు. పేకాట చూసే జనం గోల ఫర్లాంగు దూరంలో ఉన్న రోడ్డు మీదకు విన వొస్తూంది. చుట్టూ వరండాలో క్యారమ్స్ ఆడేవాళ్ళూ, చెస్ ఆడేవాళ్ళూ, రింగ్ బోర్డు ఆడేవాళ్ళూ, పత్రికలు చూసేవాళ్ళూ ఉన్నారు. పై అంతస్థులో రెండో రకం పేకాట ఆడే వాళ్ళు చేసే గోల—తెలుగు సినిమా వొచ్చిన మొదటి రోజున, నేలప్రేక్షకులు చేసే గోలను స్ఫురణకు తెస్తోంది. నాయుడు సీతాపతీ, రిటైర్డు జడ్జి జగన్నాధరావు సీరియస్‌గా బిలియర్డ్సు ఆడుతున్నారు.

కాలేజీ లెక్చరర్ కామేశ్వరరావు, రేడియో దగ్గర కూర్చుని, సిలోన్ నుంచి వొచ్చే రికార్డులు వింటున్నాడు. క్లబ్ ఇంత సందడిగా ఉన్నా—భుజంగరావు, సంజీవరావులు మట్టుకు, క్లబ్ ముందున్న గార్డెన్‌లో పచ్చ గడ్డి మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

భుజంగరావుకీ, సంజీవరావుకీ క్లబ్‌లోనే స్నేహం కలిసి దాదాపు సంవత్సరం పైచిలుకే అవుతుంది. ఇద్దరూ దాదాపు ఒకే వయస్సు వారు. సాంఘిక జీవనంలో కూడా ఇద్దరికీ పెద్ద తేడా లేదు. ఇద్దరికీ తగినంత పొలం ఉంది. ఆ పొలం మీద తగు అజమాయిషీ చేయటమే వారిపని. కానీ, వాళ్ళు కరకరమని ప్రొద్దు పొడిచే సరికే—బస్తీ కొచ్చి,

కాఫీ త్రాగి, క్లబ్‌లో జారబడతారు. బస్తీకి వాళ్ళ గ్రామాలు అయిదారు మైళ్ళల్లో ఉన్నవి. భుజంగరావు నివసించే గ్రామానికీ, సంజీవరావు నివసించే గ్రామానికీ మైలున్నరా, రెండు మైళ్ళకంటె దూరం ఉండదు. గమ్మత్తేమిటంటే — సంవత్సరం పైగా వాళ్ళు స్నేహితులుగా ఉంటున్నా, ఒకళ్ళ ఇంటికి మరొకళ్ళు వెళ్ళి యెరుగరు. అంటే వాళ్ళ స్నేహం క్లబ్‌లో ప్రారంభమై, క్లబ్‌లోనే అభివృద్ధియైనది కానీ — కుటుంబాల దాకా ప్రాకలేదు.

సాయంకాలం క్లబ్ గార్డెన్‌లో పచ్చగడ్డిమీద కూర్చుని మాట్లాడుకోవడం అంటే వాళ్ళిద్దరికీ సరదా. వాళ్ల సంభాషణలో దాదాపు లోకంలోని అన్నివిషయాలు దొర్లుతాయి గానీ, ప్రణయం, స్త్రీ, ప్రేమ, అనుభవాలు మొదలైన విషయాలమీద మట్టుకు వాళ్ళ సంభాషణ విరివిగా సాగుతుంది. స్త్రీలను పొందడాన్ని గురించీ, అందుకు చేసిన సాహసాలు, వారిని వశం చేసికోనేందుకు ఉపయోగించిన సులువైన మార్గాలు— మొదలైన వాటిని గురించి నిర్భయంగా, స్వేచ్ఛగా, ఒకళ్ళకొకళ్ళు చెప్పుకుంటారు. ఆ సంభాషణలో పడిన సమయాల్లో వారికి కాలం జరుగుతున్నట్టే తెలిసేది కాదు.

ఏదో మాట్లాడుతూ ఆరోజు సాయంకాలం, హఠాత్తుగా భుజంగరావు, సంజీవరావు ప్రక్క వేలికి ఉండే ఆకుపచ్చరాయి ఉంగరం లేకపోవడం గమనించి, ఉలిక్కి పడ్డాడు.

'సంజీవరావ్! నీ వ్రేలికి ఆకు పచ్చరాయి ఉంగర మేదోయ్!' అన్నాడతను.

ఆకుపచ్చరాయి ఉంగరం లేని వ్రేలి వంక చూసికొని సంజీవరావు గంభీరంగా ముసిముసి నవ్వులు నవ్వుకున్నాడు. ఆ ముసిముసి నవ్వుల్లో ఎంతో గూఢార్థం యిమిడి ఉన్నదని భుజంగరావు ఇట్టే గ్రహించాడు...

సంపెంగ చెట్టుమీదపడే సాయంత్రపు ఆఖరి వెలుతురు మాసిపోయింది. ఆ చెట్టు నీడనే కూర్చున్న సంజీవరావు మిత్రుని ప్రశ్నకు జవాబు చెప్పసాగాడు.

'అంతా ఒక ఇన్సిడెంటు. ఒక గొప్ప అనుభూతి. నీతో చెబుదామనే అనుకుంటున్నాను. ఇంతలో నువ్వే అడిగావు' అన్నాడు సంజీవరావు.

'ఏమిటీ! గొప్ప ఇన్సిడెంటే! అదెలా సంభవించింది?' అన్నాడు భుజంగరావు.

'ఎలాగంటే' అని కార్లటన్ సిగరెట్టు వెలిగించి, చెప్ప నారంభించాడు సంజీవరావు.

'నాలుగు రోజుల క్రితం సాయంత్రం పూట పెద్దవర్షం కురిసింది, నీకు జ్ఞాపకం ఉందా?...ఆ వర్షం కురిసే ముందే మా నిమ్మతోట దగ్గరకు వెళ్ళాను. మేఘాలు బ్రహ్మాండంగా గుమికూడటంతో, ఎందుకన్నా మంచిదని చావట్లోకి వెళ్ళాను. అంతకు ముందే పెద్ద జీతగాడ్ని పనిమీద ఇంటికి పంపించాను. చావట్లో నేను ఒక్కణ్నే. వర్షం వొచ్చింది ఉధృతంగా. చేసేదేమీ లేక నులక మంచం వాల్చుకొని కూర్చున్నాను. కోడె దూడలు గంటలు చప్పుడు చేస్తూ, కురిసే వానకేసి వింతగా చూస్తుంటే, నేను వాటికేసి చూస్తున్నాను. ఇంతలో ఇద్దరు స్త్రీలు వానలో తడుసూ చావట్లోకి వొచ్చారు. నేను

మర్యాదగా మంచం మీదినుంచి లేచి— వాళ్ళను కూర్చోమని సైగ చేశాను. నన్ను చూసి వాళ్ళు భయపడ్డారు.

వాన జోరుగా కురుస్తూంది.

'వాళ్ళు పూర్తిగా తడిసి పోయి వచ్చారు. అందులో ఒకామెకు, ఇరవై అయిదేళ్ల వయస్సు వుంటుందేమో— అబ్బా! ఎలాంటి చక్కదనం ఆమెది! బాగా వానలో తడిసి వొచ్చింది కదూ! తడిసిన సన్నని చీరె మడతల్లోంచి— ఆమె దేహ సౌందర్యం పురుషత్వం మీద సవాలు చేస్తున్నట్టుగా ఉంది. నిజం చెప్ప వొద్దూ! అప్పటివరకూ చలితో ముసుగ దీసుకొని ఉన్న నాశరీరం మీద విద్యుచ్ఛక్తి ప్రాకినట్టు అయింది. తడిసిన ఆమె ముంగురులు నుదురు మీద అందంగా పడ్డాయి.

'నామనస్సులో ఆలోచనలు వేగంగా తిరిగాయ్! ఎట్లాగైనా యీామెనుంచి సుఖాన్ని పొందాలన్న కోర్కె కల్గింది. ఆ అనుభవంలో ఉండే మాధుర్యం ఏ స్త్రీ నుంచీ పొంది వుండననే నమ్మకం ఏర్పడ్డది. మనస్సు ప్రక్క దారులు పట్టింది. ఆమె ప్రక్క నున్నది ఆమెకు రక్షణగా వొచ్చిన స్త్రీయే నని గ్రహించాను. ఎట్లాగైనా ఆమెను తాత్కాలికంగా వేరు చేసి, బలవంతంగానైనా యీామెను...అని గాఢంగా నిర్ణయించుకున్నాను' అని చెప్పుకు పోతున్నాడు సంజీవరావు.

'ఆఁ!' అంటూ భుజంగరావు ఉల్లాసంగా భుజాలు ఎగరేశాడు. సంజీవరావు తిరిగి ప్రారంభించాడు.

'ఎక్కణ్ణుంచి వొస్తున్నారు? అని మర్యాదగా పలుకరించాను. ప్రక్కవూరి నుంచి వొస్తున్నామని పని మనిషి సమాధానం చెప్పింది...బంధువుల ఇంటికెళ్ళి వొస్తున్నారట. దారిలో వాన వొచ్చిందట. ఎందుకో నావంక భయంతో చూస్తోంది ఆమె. మరి భయం కాదూ! వయస్సులో ఉన్న అందమైన స్త్రీ, ఎంత పెద్ద కేక వేసినా వినిపించుకొనే దిక్కులేని వాతావరణంలో—యమధర్మరాజులాంటి మగవాడి ముందు నిలబడ్డప్పుడు భయపడదూ?

'అయ్యో! బాగా తడిసి వొచ్చారే! చలికూడా వేస్తూన్నట్టుంది. ఆ గదిలో పంచె వున్నది వొళ్ళు తుడుచుకోండి. అట్లా తడిసి వుంటే జలుబు చేస్తుంది. అసలే ఇది మలేరియా సీజను. ఏయ్! నువ్వెళ్ళి ఆ గదిలో పంచె వున్నది కట్టుకురా!' అని పని మనిషితో అన్నాను.

'పని మనిషి చావడి మూల ఉన్న చిన్నగదిలోకి వెళ్ళింది. నేనూ ఆమె వెనుకగా వెళ్ళి, ఆమె గదిలోకి వెళ్ళడంతోనే బయట గొళ్లెం పెట్టాను. గొళ్లెం పెట్టడంతో పని మనిషి కెవ్వున కేక వేసింది. ఆ కేకకు బయటవున్న అందాలబరిణ ఎగిరి పడింది భయంతో.

'నావొళ్ళు నావశం తప్పింది. ఆకలిగొన్న సింహానికి, మేకపిల్ల కనపడ్డట్టు—నా కళ్ళకు ఆ అందాల కొణాచి కనపడింది. ఆమె దగ్గరకు వెళ్ళాను. నా రాకలోని తీవ్రతను చూసి భయకంపితయై, వెనక్కు వెళ్ళింది. గాడిమేకుకు కట్టివేసిన మచ్చలకోడె రంకె వేసింది—

'ఆమె చేయి పట్టుకున్నాను. 'వొద్దండి, నేను అలాంటి దాన్ని కాను. గౌరవమైన కుటుంబంలో బ్రతుకుతున్న

డాన్ని. మీకు దణ్ణం పెడతాను. నన్ను అపవిత్రం చేయకండి' అని ఏడ్చింది. ఆ ఆవేశంలో—ఆ ఏడుపుకు గుండె కరుగుతుందా? ఆమెను బలవంతంగా దగ్గరకు లాక్కున్నాను—తర్వాత విషయం నీకు చెప్పేదేముంది?

'కాని భుజంగరావూ! ఆ అనుభవం లోని మాధుర్యాన్ని ఏమని వర్ణించి చెప్పను? సంపూర్ణమైనతృప్తిని పొందటం చాతనే, జీవితమంతటికీ గర్వాన్ని తెచ్చి పెట్టే అనుభూతిని ఆమె అందివ్వ గలిగ బట్టే—సంతోషం కొద్దీ నూట పాతిక రూపాయల విలువ జేసే ఆకుపచ్చరాయి ఉంగరం ఆమెకు ఇచ్చాను. ఆమె తీసు కోవడానికి భయ పడ్డది. నేనే బలవంత ముగా ఆమె వ్రేలికి తొడిగాను. అంత కంటే ఆమెకు ఆ క్షణంలో; నా ఆనం దానికి చిహ్నంగా ఇవ్వగలిగింది కనపడ లేదు. కాని ఆ అనుభవానికి వెధవ నూట పాతిక రూపాయల ఉంగరపు విలువ కట్టడం చాలా అవివేకమే అనిపిస్తుంది' అని ముగించాడు సంజీవరావు తృప్తిగా నిట్టూర్చి.

'ఆమె పేరేమిటి?' అన్నాడు భుజంగ రావు చిన్న సందేహం కలిగినవాడిలాగ, ఎటో చూస్తూ.

'ఏమో! పేరు ఏదైతేనేం? అసలు ఆమె పేరు అడగాలనే ఆలోచనే ఆ ఉద్రేకంలో నాకు రాలేదు. ఆమె పేరు—నిజంగా నాకు తెలియదు' అన్నాడు సంజీవరావు.

మొత్తంమీద సంజీవరావుకు కలిగిన అదృష్టమూ, అనుభవమూ విన్న తర్వాత, భుజంగరావుకు ఎందుకో కడుపులో తెమిలి నట్లయింది. అలాంటి అదృష్టం తనకు ఎన్నడూ కలగ లేదుగదా, అని విచారపడ్డాడు. ఒకవేళ కలిగినా, తను సంజీవరావు చేసిన ధైర్యం చేయలేక పోయేవాడేమో!

'నీకు గుండె ధైర్యం ఎక్కువ సంజీవ రావ్!' అన్నాడు భుజంగరావు పేల వంగా నవ్వి.

'మరి అట్లాంటి అదృష్టాలు జీవితంలో తటస్థపడితే—దద్దమ్మలాగా చేతులు ముడు చుకు కూర్చుంటే 'జీవితం' యొక్క సార్థకత ఏమిటి?' అన్నాడు సంజీవరావు స్నేహితుని కేసి చూస్తూ.

సంజీవరావు మాటల్లో ఎంతో సత్యం వున్నదని భుజంగరావు ఆక్షణాన గ్రహిం చాడు.

నెల రోజులు గడిచాయి. ఈలోపల సంజీవరావూ, భుజంగరావూ చాలాసార్లు కలుసుకొని కబుర్లు చెప్పుకున్నారు. కాని ఒక వారం రోజులపాటు భుజంగరావు హఠాత్తుగా మాయం కావడం, సంజీవ రావుకు ఆశ్చర్యం వేసింది. సాయంత్రాలు ఏమీ తోచేది కాదు. పేక ఆడేవాళ్ళ దగ్గర, చెస్ ఆడేవాళ్ళ దగ్గర, టెన్నిస్ ఆడేవాళ్ళ దగ్గర—బలవంతంగా కూర్చుని కాలాన్ని ముందుకు నెట్టేవాడు.

వారం రోజుల తర్వాత భుజంగరావు ఒక సాయంత్రం క్లబ్‌కు వొచ్చేప్పటికి — సంజీవరావుకు ప్రాణం లేచి వొచ్చినంత పనైంది.

'ఇన్నాళ్లు ఎక్కడున్నావ్ మిత్రమా?' అన్నాడు సంజీవరావు అతని భుజంమీద తడుతూ.

'రాజమండ్రి వెళ్ళాను.

'ఏమిటి కథ?'

'ఏం లేదు! మా బంధువు ఒకాయన ఆస్తివిషయాల్లో చిక్కుల్లో ఉన్నాడు.' అన్నాడు భుజంగరావు సంగ్రహంగా.

ఇద్దరూ క్లబ్ గార్డెన్‌లోకి వెళ్ళారు. సాయంత్రపు వెలుగు ఆఖరి దశలో ఉంది. పచ్చగడ్డిమీద కూర్చున్నారు. కాకతాళీయంగా సంజీవరావు భుజంగరావు వ్రేలికి నీలపు రంగు రాయి ఉంగరం లేకపోవడం చూశాడు. మనస్సు చివుక్కు మని ఆశ్చర్యపోయాడు.

మిత్రుని ముఖంలో హఠాత్తుగా రంగు మారటాన్ని భుజంగరావు గమనించాడు.

'ఏమిటి మిత్రమా! అలా అయ్యావేం?'

'ఏం లేదు! నీ వ్రేలికి నీలపు రంగు రాయి ఉంగరం వుండాలి, ఏమైంది?'

భుజంగరావు గంభీరంగా నవ్వాడు. అతని ముఖంలోని గంభీరతను గమనించిన సంజీవరావు, తన లాగా భుజంగరావు కూడా ఏదో ఎడ్వెంచరు చేసి వుంటాడని అనుకొన్నాడు.

'ఏం జరిగిందేమిటి? ఎవరికైనా కానుకగా సమర్పించావా?' అన్నాడు సంజీవరావు లేని ఉత్సాహాన్ని తెచ్చిపెట్టుకొంటూ.

భుజంగరావు ఆ సంఘటనను తలుచుకుని ఒక్కసారి శరీరాన్ని పులకరింతతో కుదిలించుకున్నాడు. సంజీవరావులో తన మిత్రుని ఎడ్వెంచరు వినాలనే కోర్కె క్షణక్షణానికీ వృద్ధియైంది.

'ఉంగరం ఏమైనట్టు?'

'అదంతా ఒక ఏక్సిడెంటు. అట్లాంటి ఏక్సిడెంట్లు సంవత్సరానికి ఒకటో రెండో జరిగితే గాని – జీవితం కళకళ లాడుతూ వుండదు. రాజమండ్రినుంచి వొస్తున్నాను' అని భుజంగరావు తన కథకు ప్రారంభోత్సవం చేస్తూ, జేబు లోంచి రెడ్ అండ్ వైట్ ప్యాకెట్టు తీసి ఒక సిగరెట్టు మిత్రునికిచ్చి మరొకటి తాను వెలిగించాడు.

'ట్రైన్ బాగా లేటు కావడంతో బెజవాడ వొచ్చేసరికి పదిన్నరైంది. బెజవాడ వొదిలేసరికి పదకొండూ పదిహేను నిముషాలైంది. బెజవాడ స్టేషన్‌లో ఒక స్త్రీ నేను ఉన్న కంపార్ట్‌మెంటులో నే ఎక్కింది. ఆమెకు దాదాపు 25 సంవత్సరాలు వుంటాయి. ఫస్టు క్లాసు కంపార్ట్‌మెంటు కావడంచాత మరెవ్వరూ లేరు. ఆమె చేతిలో చిన్న బ్యాగ్ ఉన్నది.

'ఆమెను ఏమని వర్ణించేది సంజీవరావ్! వెధవది నాకు భాషాజ్ఞానం లేదు


ఏకాంత పఠనానికి



కోకోక శాస్త్రం: వశీకరణము, వివిధరతి భంగిమలు, అత్యంతోపయుక్తమైన అనేక ఇతర వ్యాసాలతో, ఇదివర కెన్నడూ మీరు చదివి ఉండని విషయాలతో నిండి వుంది.

పడకగది చిత్రాలు: స్త్రీత్వంలోని సౌందర్యాన్ని వివిధ భంగిమల్లో చూడదలచుకుంటే, 50 ఫోటోల సెట్టుకు నేడే ఆర్డర్ చేయండి.

పై రెండూ కలిపి రూ. 6.

H. H. STORES (A. M.)
Post Box 5I, Meerut U. P.

కాని, ఉంటే ఆమె రూపును నీకళ్ళకు కట్టినట్టు వర్ణించే వాణ్ని. బాగా వికసించిన గులాబి పువ్వు రంగే అనుకో ఆమె శరీరచ్ఛాయ. ముఖం ఎంత మనోహరంగా ఉందనీ! నీలపు రంగు మైనూరు సిల్కు చీరె ధరించింది. వంగపండురంగు సిల్కు జాకెట్టు వేసింది. మెడలో రాళ్ళ నెక్ లెస్ ఎలక్ట్రిక్ లైటు కాంతికి జలపాతం వద్ద రేగే నీటి తుంపరల్లోని ఇంద్రధనుస్సు రంగుల నీడల్ని అందంగా ఆమె వక్షం మీద మెరిపిస్తోంది. రైలు బయలుదేరింది. పెట్టెలో నేను ఒక్కణ్నే ఉండటం, ఎవ్వరూ ఎక్కక పోవడం చూసి—ఆమె భయపడ్డట్టు నాకు అగపడింది. నేను ఆమెవంక చూడకుండా తల కిటికీలోపెట్టి - జరిగిపోయే విజయవాడ ఎలక్ట్రిక్ దీపాల కేసి చూస్తున్నాను. పది నిముషాల తర్వాత ఏదో మ్యాగజైన్ తెరిచి బొమ్మలు చూడ నారంభించాను. బొమ్మలు చూస్తూనే ఓరకంటితో ఆమె సౌందర్యాన్ని తిలకిస్తున్నాను. పట్టుకుంటే జవజవ జారిపోయే సిల్కుగుడ్డలాగా వుంది ఆమె అందం, శరీరపు మెత్తదనం, వొంపుల నీడలు, రైలు వేగాన్ని అందుకుంది. నామనస్సుకూడా వేగాన్ని అందుకుంటూంది—ఆమెను చూస్తూన్న కొద్దీ. నావంక రెండు మూడు సార్లు చూసింది బెదురుతూన్న ఆ హరిణాక్షి! నాలో ఆలోచనల పొరలు ఒక్కొక్కటిగా విడిపో నారంభించాయి. నువ్వూ, నీ సాహసం మనోపథంలో ఒక్కసారి మెరిశాయి. హృదయంలో ధైర్యం కత్తి మొనలా పొడుచుకు వొచ్చింది. శరీరంలో వేడి క్లయిమాక్సును అందుకుంది.

'ఎట్లాగైనా యీమెనుంచి అనుభవాన్ని పొందాలి! ఆమె ఎవరో, ఆమె ఊరు ఏమిటో, ఆమె పేరేమిటో—ఇవన్నీ అడిగి తెలుసుకోవటం ద్వారా కాలాన్ని వెళ్ళబుచ్చడం సబబుగా తోచలేదు. తీరా ఇంత విచారణా జరపడం వల్ల—రేగిన కోర్కెలకు తగిన న్యాయం చేకూరక పోవొచ్చు, రెక్కలు విప్పుకొన్న మోహం చప్పబడి పోవాల్సిన అవస్థ పట్టవచ్చు, ఏమంటావ్?'

'భేష్! ఆ సమయంలో ముందు వెనుకలు ఆలోచించరాదు' అన్నాడు సంజీవరావు హుషారుగా.

'ఆమె వంక చూశాను నవ్వుతూ. సలసల కాగే నీటిమీద నుంచి పొగలు రేగినట్టుగా, తహ తహ లాడే నాకళ్లల్లో మోహపు పొగలు రేగడం ఆమె గమనించి వుంటుంది. భయపడ్డది. నాలోని మానవత్వం, ముందు వెనుకలు ఆలోచించే శక్తి—పూర్తిగా అడుగంటి పోయాయి. ఆమెవంక చూస్తూ లేచాను. ఆమె వొణికి పోయింది. నేనూ వొణికి పోతున్నాను. కాని నా శరీరంలో నరాలు కలిగించిన విప్లవం—నన్ను పిచ్చివాణ్నిగా చేసింది. ఆమె ప్రక్కనే కూర్చున్నాను. ఆమె గబుక్కున లేచింది. నోరు విప్పబోయింది. కాని ఆ భయంలో, వొణుకులో—ఆమె పెదవులు విడివడలేదు. ఆమె చేయి పట్టుకుని దగ్గరకు లాక్కున్నాను. వొణికే ఆమె పెదాల్ని, అదిరే ఆమె చెంపల్ని, కదిలే ఆమె కనురెప్పల్ని—బలంగా ముద్దు పెట్టుకున్నాను. నాకౌగిలిలోంచి బయటపడేందుకు బ్రహ్మాండంగా ప్రయత్నించింది, కానీ లాభం లేకపోయింది. కానీ తీరా నేరం జరిగిపోయాక

ఆమెను చూస్తే నాకు జాలి వేసింది. నా పశుత్వం నాకు తెలిసి వొచ్చింది, ఆమె ఏడ్పును చూశాక. కాని ఆమె నాకు ఇచ్చిన అనుభవానికి పారితోషికం ఇవ్వాలనిపించింది. కానీ ఆ సమయంలో ఆ ఉంగరం తప్ప నాదగ్గరేమీ లేదు. చప్పున నువ్వు జ్ఞాపకం వచ్చావు. వ్రేలిన ఉన్న నీలపు రాయి ఉంగరం తీసి ఆమె దగ్గర పెట్టి—స్టేషను రాగానే ఆమె ముఖం వంక చూసే ధైర్యం లేక దిగి వొచ్చాను' అని ముగించాడు భుజంగ రావు.

'మొత్తానికి నన్ను అనుసరించావం టూవ్!' అన్నాడు సంజీవరావు నవ్వుతూ.

'నువ్వు నేర్పిన విద్యయే గదా!' అన్నాడు భుజంగరావు ఆనవ్వులో తన నవ్వు కలుపుతూ.

దాదాపు రెండు నెలలు గడిచాయి. సంజీవరావూ, భుజంగరావూ ఎప్పటి స్నేహంతోనే ఉన్నారు. ఇద్దరూక్లబ్‌లో కలుసుకొని, గార్డెన్‌లో చల్ల గాలికి కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నారు.

ఆరోజు మధ్యాహ్నం రెండుగంటలకు బస్తీకి వెళదామని బయలుదేరాడు సంజీవ రావు. భార్య ఇంట్లో లేదు. పిన్ని కూతు రికి టైఫాయిడ్ వొస్తే చూసి రావడాని కని దోసపాడు వెళ్లింది.

సంజీవరావు డ్రస్సు వేసికొని, జేబు రుమాలకోసం బీరువా తీశాడు. బీరువా అంతా వెతికాడు. అగపడలేదు. మహా చెడ్డ చిరాకు వేసింది. భార్య గుడ్డలపెట్టె తీశాడు. అందులో వెతికాడు. ఆమె పెట్టెలో కూడా జేబు రుమాల అగపడ లేదు. అన్నీ చాకలి దగ్గర ఉన్నట్టు న్నాయి మరి!

కాని భార్యపెట్టె అడుగున సంజీవ రావుకు నీలపురాయి ఉంగరం అగపడింది. అతని తల ఆ ఉంగరాన్ని చూడటంతో దిమ్మెత్తి పోయింది. కళ్ళముందు చీకటి కమ్మింది.

ఎవరిది ఆ ఉంగరం? నీలపురాయి ఉంగరం? అది భుజంగరావుది. మిత్రుడు భుజంగరావుది. ఎంత దారుణం! తన భార్య పెట్టెలోకి ఎట్లా వొచ్చింది? అది తప్ప కుండా భుజంగరావుదే! ఆ నీలపు రాయీ, ఆనగిషీ—అంతా భుజంగరావు ఉంగరానికున్న లక్షణాలే ఉన్నాయి. అనుమానం అక్కర్లేదు. అది తప్పకుండా తన స్నేహితునిదే!

ఒకరోజు తనకి పార్కులో చెప్పాడు ఒక అనుభవం. రైల్లో... అర్ధ రాత్రి... ఒక స్త్రీని బలవంతంగా...ఆనందానికి చిహ్నంగా......నీలపురాయి ఉంగరం బహూకరించాడట...అంటే తన భార్య కన్నమాట! ఆఁ! నిజమా! వాడు...ఆ భుజంగరావు గాడు, చింతపంక రండూ, వాడూ...తనభార్యను...ఎంత ఘోరం! వాడ్ని...నిలువునా నరికి వేయాలి! ఇంత మిత్రద్రోహం చేస్తాడా? తను వదల కుండా వూరుకోరాదు, రెండుమాసాల క్రితం తనభార్య బంధువుల ఇంటికి వెళ్లి— ఆ రాత్రి బండిలో ఇంటికి వొచ్చింది. ఈ భుజంగరావుగాడు తనభార్యనే బల వంతం చేశాడు. ఈరోజు వాడ్ని పిండి పిండి చేయాలి. దుర్మార్గుడు ..ద్రోహి!

సంజీవరావు రుద్రుడైనాడు. కోపో ద్రేకంతో తల్ల క్రిందులైనాడు. ఆ తక్షణావ

అతనిలో అసహనము, క్రౌర్యము, ఉద్వేత్తుగా రేగాయి.

అలాగే క్లబ్‌కు వొచ్చాడు సంజీవరావు. అతని ముఖంలోని తీవ్రతనుబట్టి మనిషి ఎంత కోపంలో, ఆవేశంలో ఉన్నాడో సులభంగా గ్రహించవచ్చు. క్లబ్ వరండా కేసి చూశాడు. అక్కడ భుజంగరావు నిలబడి ఉన్నాడు.

సంజీవరావులో ఆలోచనలు తీవ్రంగా తిరుగాడినాయ్! ఏంచేయాలి? భుజంగరావుమీద చేయి చేసికోవడమే నా కర్తవ్యం? తను యీ కోపోద్రేకంలో భుజంగరావును చెంపలు వాయిస్తే— క్లబ్‌లోని జనమంతా చుట్టూ మూగుతారు. అందరూ కారణం కోసం వెతుకుతారు. కారణమేమిటి?... భుజంగరావు...తన భార్యను..రైల్లో...బలవంతంగా...! భుజంగరావు దుర్మార్గం తెలిసిపోతుంది. కాని దానితోపాటు తన భార్య తాలూకు పాతివ్రత్యపు పరపతి కూడా బట్టబయలు అవుతుంది. అప్పుడు సంఘంలో తనకూ, తనభార్యకూ విలువ ఏముంటుంది? అప్పుడు తనూ, తనభార్య లోకం నోళ్లల్లో నానిపోతారు. భుజంగరావుకు ఆమె—తన మిత్రుని భార్య అని తెలియదు. ఆరహస్యాన్ని అతనికి తెలియనివ్వకుండా ఉంచడంలోనే తనకి ఎక్కువ మేలు జరగొచ్చు. తన ప్రతిష్ఠను కూడా ఆవిధంగానే కాపాడుకోవొచ్చు. కనుక తను కోపాన్ని దిగమ్రింగడమే ఉత్తమం.

అలా ఆలోచించిన సంజీవరావు, బలవంతాన కోపాన్ని దిగమ్రింగుకున్నాడు. సాధ్యమైనంతవరకు ముఖాన్ని తేటగా ఉంచేందుకు ప్రయత్నిస్తూ, భుజంగరావు దగ్గరగా వొచ్చాడు.

కాని భుజంగరావు ముఖం గంభీరంగానూ, కోపోద్రేకంగానూ ఉండటంతో, సంజీవరావు గుండె రక్కున బిగదీసినట్టయింది. ఎందుకో అర్థం కాలేదు. భుజంగరావు మిత్రుడ్ని క్రిందకీ పైకీ జుగుప్సగా చూసి, తుపుక్కున నేలమీద ఉమ్మివేసి గబగబా నడిచి వెళ్లాడు.

సంజీవరావు నిర్వీణ్ణుడై నిలబడిపోయాడు. ఏం జరిగింది? తానేం నేరం చేశాడు? భుజంగరావు వింత ప్రవర్తన వెనుక దాగున్న కారణమేమిటి? అర్థంగాక తికమక పడ్డాడు.

అంతేకాని, భుజంగరావుకు ఆవేళ మధ్యాహ్నం దేనికోసమో భార్య ట్రంకు పెట్టె వెతుకుతూండగా, అడుగున ఒక పచ్చరాయి ఉంగరం దొరికిందనీ, ఆ ఉంగరం సంజీవరావుదనీ, అది ఒక సాయంత్రం బంధువుల వూరినుంచి పనిమనిషి తోడుగా నడిచి వొస్తూన్న తన భార్యకు, అతను చావట్లో బలవంతాన అనుభవించిన అనంతరం, మధుర స్మృతి చిహ్నంగా ఇవ్వబడిందనీ, ఆ దుర్మార్గం మిత్రుడైన సంజీవరావు చేసిందేననీ— తెలిసినట్టు సంజీవరావుకు తెలియనే తెలియదు.

కాని వారం రోజుల తర్వాత మళ్లా క్లబ్‌లో మిత్రులిద్దరూ కలుసుకున్నారు. భుజంగరావే ముందుగా మర్యాదగా పలుకరించాడు. సంజీవరావు కూడా మర్యాదగానే పలికాడు. క్లబ్ గార్డెన్‌లో కూర్చుని ఆసాయంకాలం వాళ్లు మామూలుగానే లోకంలో చెడిపోయిన ఆడవాళ్లను గురించీ, ప్రణయం వగైరాలను గురించీ, హాయిగా కబుర్లు చెప్పుకున్నారు.

★